సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం : 26 : ఫిబ్రవరి : 2025



ఈవీఎం గోడౌన్ తనిఖీ

ఏలూరు(మెట్రో): ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ కె. వెట్రిసెల్వి మంగళవారం తనిఖీ చేశారు. భద్రతా సీళ్లు, సీసీ కెమెరాలు పనితీరు, అగ్నిమాపక పరికరాలు పరిశీలించారు.



మహాయజ్ఞానికి శ్రీకారం

ద్వారకాతిరుమల సుందరగిరిపై లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో మహాశివరాత్రి పురస్కరించుకుని నిర్వహించనున్న మహాయజ్ఞానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. 8లో ▸



అలుగోత్సవం

తణుకు మండలం తేతలిలో పార్వతీ రాజేశ్వరీస్వామి ఆలయంలో అలుగోత్సవంలో శూలాలను గుచ్చుకుని చేసిన విన్యాసాలు ఒళ్లు గగుర్పొడిచేలా నిలిచాయి. 8లో ▸

న్యూస్‌రీల్

ప్రమాదకర పరిశ్రమల్లో భద్రతకు చర్యలు



భీమవరం విష్ణు కళాశాలలో రక్షణ పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: ప్రమాదకర పరిశ్రమల్లో భద్రతకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై యాజమాన్యాలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. మంగళవారం భీమవరం విష్ణు కళాశాలలో ప్రమాదకర పరిశ్రమలలో భద్రతా నిర్వహణపై శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పరిశ్రమల ప్రతినిధులు భద్రతా కమిటీ సమావేశాలను నిర్వహించాలని, ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఎత్తయిన ప్రదేశాల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు సరైన జాగ్రత్తలను తీసుకోవాలని స్పష్టం చేశారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగానికి నిధులు కేటాయించాలి



భీమవరంలో డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: తీవ్ర సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమకు ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా తాత్సారం చేయడం అన్యాయమని చేనేత కార్మిక సంఘం నాయకుడు ఎం.సీతారామ్‌ప్రసాద్ అన్నారు. చేనేత రంగాన్ని ఆదుకోవాలని మంగళవారం భీమవరంలో జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) ఎం.వెంకటేశ్వర్లుకు జిల్లా చేనేత కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందచేశారు. అనంతరం సీతారాంప్రసాద్ మాట్లాడుతూ చేనేత కార్మికులు పనులు లేక అప్పులు చేసుకుని జీవిస్తున్నారని, ఆకలితో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేతన్న నేస్తం పథకాన్ని రూ.36 వేలకు పెంచి సొంత మగ్గం ఉన్న వారితో పాటు ఉపవృత్తుల వారికి కూడా ఇవ్వాలన్నారు. సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు, చాంద్ బాషా, పీసీ జోషి, గుడిమెట్ల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



తణుకులో ధర్నా నిర్వహిస్తున్న హమాలీలు

తణుకు అర్బన్: ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల సంస్థ హమాలీ కార్మికులకు పెంచిన కూలీ రేట్లు, 14 నెలల ఎరియర్స్ చెల్లింపునకు వెంటనే జీవోలు జారీ చేయాలని ఏపీ పౌరసరఫరాల సంస్థ హమాలీస్ రాష్ట్ర యూనియన్ గౌరవ అధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సివిల్ సప్లయిస్ గొడౌన్ ఆవరణలో సీఐటీయు ఆధ్వర్యంలో హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలు అందిస్తున్న సేవలకు ప్రభుత్వం నుంచి నేటికీ గుర్తింపు లేదని, ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోవడంలేదని, ఈఎస్ఐ గత 30 ఏళ్లుగా అమలు చేయకపోవడం అన్యాయమని దుయ్యబట్టారు. మార్చి 4న తహసీల్దారు కార్యాలయాల వద్ద రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తామని, అప్పటికి ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే మార్చి 20 నుంచి సమ్మెకు దిగనున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు (టూటౌన్): వచ్చే నెల 8న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 10 మండల లీగల్ సర్వీసెస్ కమిటీల్లో, జిల్లా న్యాయసేవాధికార సంస్థలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇంతవరకు 2,012 క్రిమినల్ కేసులు, 2,341 సివిల్ కేసులు, 2795 ప్రీలిటిగేషన్ కేసులు గుర్తించామన్నారు.

హరహర మహాదేవ



భీమవరం(ప్రకాశం చౌక్): విద్యుత్ అలంకరణలో భీమవరం పంచారామ క్షేత్రం



భీమవరం(ప్రకాశం చౌక్): ఉమాసోమేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు



పెనుగొండ: ఆచంటేశ్వరుడి గ్రామోత్సవం

మహా శివరాత్రి

ఉత్సవాలకు జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలు, శివాలయాలు సన్నద్ధమయ్యాయి. ఆలయాలన్నీ విద్యుద్దీప కాంతులతో ప్రత్యేక శోభ సంతరించుకున్నాయి. హరహర మహాదేవ.. శంభో శంకర అంటూ భక్తుల మంత్రోచ్ఛరణలతో మార్మోగుతున్నాయి. జిల్లాలోని పంచారామ క్షేత్రాలైన భీమవరం, పాలకొల్లుతో పాటు ఆచంట, నత్తా రామేశ్వరం తదితర క్షేత్రాల్లో చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూ లైన్లు నిర్మించారు. బుధవారం తెల్లవారుజామునుంచే ఆలయాల్లో విశేష అభిషేకాలు, నిర్వహించనున్నారు.

-సాక్షి నెట్‌వర్క్



పెనుమంట్ర: నత్తరామేశ్వరం ఉమా రామలింగేశ్వర ఆలయంలో విద్యుత్ కాంతులు



పెనుగొండ: ఆచంట రామేశ్వర స్వామి ఆలయం



పాలకొల్లు సెంట్రల్: ధగధగలాడుతున్న క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం

● పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలు

కూటమికి హామీల గండం

- 9 నెలలు గడిచినా ఒక్కటీ నెరవేర్చని వైనం
- కలగా మిగిలిన నిరుద్యోగ భృతి
- 20 వేల మంది వలంటీర్లను రోడ్డున పడేసిన ప్రభుత్వం
- మెగా డీఎస్సీ హామీ కూడా గాలికే
- ఉద్యోగ, ఉపాధ్యాయులకు హామీలు నీట మీద రాతలే
- సూపర్ సిక్స్ పేరుతో వంచించి ఓట్లు దండుకున్న కూటమి



సాక్షి ప్రతినిధి, ఏలూరు: పట్టభద్రులకు కూటమి సర్కారు ఇచ్చిన హామీలు నీటి మీద రాతలయ్యాయి. ఇంటికో ఉద్యోగం అన్నారు.. ఇవ్వకపోతే ప్రతి నెల రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. వలంటీర్లకు రూ.10 వేలు ఇచ్చి కొనసాగిస్తామన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు లెక్కలేనన్ని హామీలు ఇచ్చారు. కట్ చేస్తే.. 9 నెలలు గడిచినా ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. ఈ క్రమంలో జరుగుతున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు సర్కారుకు తలపోటుగా మారాయి. నిరుద్యోగులు మొదలుకొని ప్రభుత్వ ఉద్యోగుల వరకు అందరిలోనూ అసంతృప్తి పెరగడం కూటమి అభ్యర్థికి గండంగా మారింది. మరోవైపు బలమైన పోటీ ఇస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి సూపర్ సిక్స్ హామీల వైఫల్యాలపైనే ప్రచారం చేస్తూ ఎన్నికలకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో 27న గ్రాడ్యుయేట్ల ఎమ్మెల్సీ ఎన్నికల తీర్పు ఎలా ఉంటుందనే ఉత్కంఠ సర్వత్ర నెలకొంది. రెండు ఉమ్మడి జిల్లాల్లో 546 పోలింగ్ కేంద్రాల్లో, 3.15 లక్షల మంది గ్రాడ్యుయేట్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు హోరాహోరీగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అధికార పార్టీ అభ్యర్థి రాజశేఖరం స్థానిక ప్రజాప్రతినిధుల పైనే ఆధారపడి ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం యువత, నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీలపై మాట తప్పిందని విస్తృతంగా చర్చ సాగింది. ఇప్పటికే వ్యతిరేకత పెరిగిన క్రమంలో ఓటర్లను ప్రలోభాలతోనైనా దారికి తెచ్చుకోవడానికి కూటమి ప్రయత్నాలు మొదలుపెట్టి ఓటుకు నోటుకు తెరదీసింది.

కూటమి అభ్యర్థికి సూపర్ సిక్స్ షాక్

పోటీలో ఉన్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి సూపర్ సిక్స్ వైఫల్యాలే ప్రధాన సమస్యగా మారింది. మోసం చేశారని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు విస్తృత ప్రచారం నిర్వహించాయి. మరోవైపు వలంటీర్లు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలు ప్రభుత్వ చర్యలతో భారీగా నష్టపోవడంతో కూటమి అభ్యర్థికి బలమైన షాక్‌గా మారింది. ఎన్నికల ప్రచారంలోనూ అనేక చోట్ల ఇదే సమస్య ఉత్పన్నమవుతున్నా స్థానిక ఎమ్మెల్యేల హడావుడితో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. గెలవడానికి అడ్డదారులు తొక్కడానికి కూడా సిద్ధపడిన వైనాన్ని కూడా పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి.

వలంటీర్లను ముంచేశారు

వలంటీర్లపై కూటమి నేతలు ఎన్నికల వేళ విపరీతమైన ప్రేమ చూపారు. వలంటీర్ వ్యవస్థను కొనసాగించి ఒక్కొక్కరికి రూ.10 వేల జీతం ఇస్తామని పదే పదే ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి రాగానే వలంటీర్ల వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి వేలాది మందిని రోడ్డు పడేశారు. ఏలూరు జిల్లాలో 10,515, పశ్చిమగోదావరి జిలాల్లో 9,148 మంది వలంటీర్లు ఉద్యోగాలు కోల్పోయారు. ధర్నాలు, ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కాంట్రాక్టర్ల కబంధ హస్తాల్లో నలిగిపోతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు గత ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. ఆప్కాస్‌ను ఏర్పాటు చేసి జీతాలు నేరుగా ప్రభుత్వమే చెల్లించేలా ఏర్పాటు చేసి కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి జిల్లాలో 5,034 మందికి మేలు చేకూర్చింది. మళ్ళీ కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసి కాంట్రాక్ట్‌కు అప్పగించడానికి సన్నాహాలు చేయడంపై నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి.

నిరుద్యోగ భృతిపై చేతులెత్తేసిన సర్కారు

కూటమి అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున భృతి ఇస్తామని ప్రకటించారు. ఇంటికో ఉద్యోగం లేదంటే రూ.3 వేలని నమ్మించి ఓట్లు దండుకున్నారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతిని విజయవంతంగా అటకెక్కించారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 4,50,118 గృహాలున్నాయి. వీటిలో పట్టణ ప్రాంతాల్లో 97,672 గృహాలున్నాయి. మొత్తంగా 5,47,790 నివాసాలున్నాయి. ఈ ప్రకారం ఇంటికి రూ.3 వేలంటే ఉమ్మడి జిల్లాలో నెలకు రూ.164 కోట్లు సర్కారు పంపిణీ చేయాలి. నిరుద్యోగ భృతిపై సర్కారు చేతులెత్తేసింది.

ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పట్టభద్రుల ఓట్లు 70,052 కాగా పురుషుల ఓట్లు 39,863, మహిళల ఓట్లు 30,187 ఓట్లు ఉన్నాయన్నారు. 93 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని, 27న పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు చెప్పారు. 17 రూట్ ఆఫీసర్లుగా పంచాయతీ సెక్రటరీలు నియమించామన్నారు. 7 సెక్టార్లకు ఏడుగురు గెజిటెడ్ అధికారులను నియమించామని చెప్పారు. బ్యాలెట్స్ పేపర్లు, ఎన్నికల మెటీరియల్స్ జిల్లాలోని మూడు ఆర్డీవో కార్యాలయాలకు ఇప్పటికే చేర్చామని, గురువారం ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రారంభించి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్లు వరకు 144 సెక్షన్ అమలల్లో ఉంటుందని తెలిపారు.

27న ప్రత్యేక సెలవు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఓటు హక్కు ఉన్న వారికి ఓటు వినియోగించుకునే వీలుగా ఫిబ్రవరి 27న స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను ఎన్నికల సంఘం ప్రకటించిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రాలకు, ఏర్పాట్ల నిమిత్తం 26న కూడా స్థానిక సెలవుగా ప్రకటించామన్నారు.

పాఠశాలలకు సెలవు ప్రకటించాలి

భీమవరం: ఈ నెల 27న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవు ప్రకటించాలని యుటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, రామభద్రం, గౌరవాధ్యక్షుడు పట్టాభి రామయ్య తదితరులు కలెక్టర్, డీఈవోకు వినతిపత్రం అందచేశారు.

ఓటుకు నోటుతో ప్రలోభాలు

- గ్రాడ్యుయేట్‌కు రూ.వెయ్యి, పోస్టల్ బ్యాలెట్‌కు రూ.2 వేలు
- ప్రజాప్రతినిధి కనుసన్నల్లో పంపిణీ ప్రక్రియ
- ఉమ్మడి జిల్లాలో ముగిసిన ఎన్నికల ప్రచారం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పట్టభద్రుల ఎన్నికల బరిలో అధికార పార్టీ ప్రలోభాల పర్వానికి తెరతీసింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు వల్ల బలంగా నష్టం చేకూరుతుందనే యోచనతో ఓటుకు నోటుకు తెరదీసి ఓటర్లకు డబ్బు పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికలు 27న జరగనున్న క్రమంలో మంగళవారం సాయంత్రం 4 గంటలతో ఎన్నికల నిబంధనల మేరకు ప్రచార పర్వం ముగిసింది. ప్రచార పర్వం ముగింపుతో ప్రలోభాల పర్వానికి తెరలేచింది. గ్రాడ్యుయేట్ ఓటుకు రూ. వెయ్యి, పోస్టల్ బ్యాలెట్‌కు రూ.2 వేలు పంపిణీ ప్రక్రియకు టీడీపీ నేతలు తెరదీశారు. మంగళవారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారానికి తెరపడింది. ప్రధానంగా ఎన్నికల బరిలో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు హోరాహోరీగా ప్రచారం సాగించారు. వీరు కాకుండా స్వతంత్రులుగా బరిలో ఉన్న మాజీ ఎంపీ హర్షకుమార్ కుమారుడు జీవీ సుందర్ కుమార్, మరికొందరు జిల్లాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థి ఎమ్మెల్యేల సహకారంతో క్యాంపు కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించారు. కూటమి అభ్యర్థికి మద్దతుగా ఎమ్మెల్యేలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఓటర్లను కలిసి ఓటు హక్కు అభ్యర్థించారు. పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. ఎన్నికల సంఘం ఆదేశాలతో ఎన్నికల ప్రచారం ముగియడంతో పాటు ఉమ్మడి జిల్లాలోని వైన్‌షాపులు, బారులు 48 గంటలు పాటు మూతపడ్డాయి.

ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలి

భీమవరం: విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పబ్లిక్ పరీక్షలకు హాజరైతే నూరు శాతం ఫలితాలను సాధిస్తారని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం భీమవరం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని అన్ని జెడ్పీ పాఠశాల టెన్త్ విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమాన్ని గూగుల్ మీట్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మోటివేషన్ కార్యక్రమంలో 13 వేల మంది విద్యార్థులతోపాటు 1,500 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారన్నారు. జీవితంలో ముందుకు సాగాలంటే పిల్లలకు ధైర్యం అవసరమన్నారు. రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ నుంచి స్వామి సేవ్యానంద్ విద్యార్థులతో గూగుల్ మీట్ ద్వారా మాట్లాడుతూ సమస్త శక్తి మీలోనే ఉంటుందని మీరు ఏదైనా సాధించగలరని స్వామి వివేకానందను గుర్తు చేస్తూ తెలిపారు. శక్తి అనేది ప్రతి ఒక్కరిలో సమానంగానే ఉంటుందని మనం ఏదీ ఆలోచిస్తే అదే జరుగుతుందన్నారు.

చెత్త తొలగింపు



బ్రౌనింగ్ కళాశాల వద్ద చెత్త తొలగించక ముందు

భీమవరం(ప్రకాశం చౌక్): పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్న భీమవరం మున్సిపాలిటీలో ప్రక్షాళన చేపట్టారు. ఇటీవల సాక్షి పత్రికలో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. చెత్త తొలగింపు పనులు చేపట్టారు. డ్రెయిన్లలో తూడు తొలగించి శుభ్రం చేస్తున్నారు.

సాక్షి స్పందన



బ్రౌనింగ్ కళాశాల వద్ద చెత్త తొలగించిన తర్వాత

ఆప్కాస్ రద్దు నిర్ణయంపై ఆగ్రహం



భీమవరం 5వ డివిజన్ వద్ద ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

భీమవరం: ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేటు కాంట్రాక్టర్ ద్వారా పారిశుద్ధ్య పనులు చేయించాలనే కేబినెట్ నిర్ణయాన్ని ఉపసంహరించాలని సీఐటీయు డిమాండ్ చేసింది. మంగళవారం భీమవరం 5వ డివిజన్ మస్టర్ కార్యాలయం వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు మాట్లాడుతూ ఆప్కాస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, నూతన పీఆర్సీ ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులకు పని భారం పెరిగిందని దానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, ఇంజనీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు ఆశలకు అనుగుణంగా పరిపాలన సాగట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్నాలో యూనియన్ నాయకులు నీలాపు రాజు, నీలాపు అప్పన్న, పెంటా సత్యనారాయణ, మురళి, దుర్గమ్మ, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

సూర్య ఘర్ యోజనపై కలెక్టర్ సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం అమలుపై విద్యుత్తు శాఖ అధికారులు, బ్యాంకర్లుతో కలెక్టరు చదలవాడ నాగరాణి మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ఇంతవరకు 13,610 దరఖాస్తులు రిజిస్టరు కాగా 662 ఇళ్లకు మాత్రమే సోలార్ ప్యానల్స్ పెట్టారని చెప్పారు. సోలార్ ప్యానల్ వల్ల లాభాల గురించి మరింత అవగాహన కల్పించేలా అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు. ఫలితాలు సాధించడంలో అధికారులు అలసత్వంగా ఉన్నారన్నారు. సమీక్ష సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, విద్యుత్తు శాఖ అధికారి ఏ.రఘునాథ బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

నూజివీడు: ట్రిపుల్ ఐటీ విద్యార్థులందరూ సాంస్కృతిక మహోత్సవం సిగ్నస్ 25లో పాల్గొని వారి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ పేర్కొన్నారు. సిగ్నస్ 25లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాల పోటీల నిర్వహణను మంగళవారం డైరెక్టర్ ప్రారంభించారు. సిగ్నస్‌లో భాగంగా విద్యార్థులకు మిస్టర్ అండ్ మిస్ ట్రిపుల్ ఐటీ, రంగోలి, కిచెన్ క్రానికల్స్, షార్ట్ ఫిలిం పోటీలు నిర్వహిస్తారన్నారు. తొలిరోజున విద్యార్థులకు డిబెట్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ బీ లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ చిరంజీవి, డీఎస్‌డబ్ల్యూఓ టీ దుర్గాభవాని, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్‌జైట్-25 వాయిదా

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహించాల్సిన సాంకేతిక సంబరం టెక్‌జైట్-25ను వచ్చేనెల 10, 11, 12 తేదీలకు వాయిదా వేసినట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించాలని నిర్ణయం తీసుకోగా శివరాత్రి పర్వదినంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కూడా ఉండటంతో టెక్‌జైట్ నిర్వహణను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: గంజాయి సేవిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు జంగారెడ్డిగూడెం సీఐ వి.కృష్ణబాబు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు స్థానిక రామచంద్రాపురంలో తనిఖీలు నిర్వహిస్తుండగా పిరమిడ్ సమీపంలో గంజాయి సేవిస్తూ శివరాత్రి వీరవెంకట దుర్గాప్రసాద్, తుంపాల సాయి పట్టుబడ్డారన్నారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద 2 కేజీల 335 గ్రాముల గంజాయి గుర్తించినట్లు చెప్పారు. నిందితులను అదుపులోకి తీసుకుని గంజాయి ప్యాకెట్లతో పాటు, రెండు సెల్‌ఫోన్‌లు, పల్సర్ బైక్, రూ. 280 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కాగా నిందితులపై మంగళవారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ తనిఖీల్లో జంగారెడ్డిగూడెం ఇన్‌చార్జి ఎస్సై, లక్కవరం ఎస్సై శశాంక, సిబ్బంది పాల్గొన్నారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై ట్రాక్టర్ ఎక్కడంతో..

లింగపాలెం: లారీ రివర్స్ చేస్తుండగా ట్రాలీట్రాక్టర్‌ని ఢీకొనడంతో దాని కింద నిద్రిస్తున్న వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మాజీగూడెంలో విజయలక్ష్మి మొక్కజొన్న ఫ్యాక్టరీలో ముసునూరుకు చెందిన బడిపాటి ఆగస్టీన్ ట్రాలీ ట్రాక్టర్‌లో మొక్కజొన్న లోడు వచ్చాడు. ఫ్యాక్టరీ లోపల బండి సీరియల్‌లో పెట్టి ట్రాలీ కింద నిద్రిస్తుండగా ఒక లారీ రివర్స్‌లో వచ్చి ట్రాలీని ఢీకొట్టింది. దీంతో కింద నిద్రిస్తున్న ఆగస్టీన్‌పై ట్రాలీ ఎక్కి అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈసంఘటన చోటుచేసుకొంది. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. ధర్మాజీగూడెం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వెంకన్న చెప్పారు.

శివరాత్రి మహోత్సవాలు ప్రారంభం

- పంచారామం, సోమారామం, పట్టిసం, బలివేలో పటిష్ట ఏర్పాట్లు
- ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

బలివే (ముసునూరు): మహాశివరాత్రి పర్వదినానికి శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని సోమారామం, పంచారామం, పట్టిసం, బలివే క్షేత్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను అధికారులు పరిశలించారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన బలివేలోని మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, నోడల్ అధికారి, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఈఓ పామర్తి సీతారామయ్య మంగళవారం సాయంత్రం ఉత్సవాల ఆరంభాన్ని ప్రకటించారు. ఉత్సవాల ప్రత్యేకాధికారి నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ ప్రత్యేక పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. ఆలయ, ఉత్సవ ప్రాంగణాల్లో క్యూలైన్లు బారికేడ్లు, లడ్డూ, చక్రపొంగలి, పులిహోరా ప్రసాద కేంద్రాలు, భక్తుల పుణ్యస్నానాల కోసం జల్లు స్నానాలు ఏర్పాటు చేశారు. మహిళల దుస్తుల మార్పిడి కోసం మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. రెండు వైద్య శిబిరాలు, అత్యవసర సేవలకోసం రెండు 108 వాహనాలను, అగ్నిమాపక శకటాలను, స్నాన ఘాట్‌ల వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. నూజివీడు, ఏలూరు ఆర్టీసీ డిపో యాజమాన్యాలవారు మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు ఉండేలా నడుపుతున్నారు. మొత్తం 400 మంది సిబ్బంది పోలీసింగ్ నిర్వహిస్తారని డీఎస్పీ తెలిపారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతల సహకారంతో లక్షలాదిగా తరలిరానున్న భక్తులకు ఉచిత అన్నదాన శిబిరాలు, చక్రపొంగలి, పులిహోరా, మజ్జిగ, మంచినీళ్ల ఏర్పాట్లు చేశారు.

వీరంపాలెంలో...

తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరి విద్య, ఆధ్యాత్మిక పీఠంలో మంగళవారం మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత చక్కా వెంకట రామ రమణమూర్తి, కర్రి వెంకట రామకృష్ణారెడ్డి కలశ స్థాపన చేశారు. పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి పర్యవేక్షణలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం మహాదేవునికి పవిత్ర జలాలతోనూ, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి తెలిపారు. భక్తులు పాల్గొని స్ఫటిక లింగాన్ని దర్శించి తరలించాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీవారి క్షేత్రంలో నేడు శివ కల్యాణం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆలయంలో మంగళవారం స్వామివారికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చనలను నిర్వహించారు. సాయంత్రం గంగా, పార్వతీ సమేత శివదేవుని ఉత్సవమూర్తులను నంది వాహనంపై క్షేత్ర పురవీదుల్లో ఊరేగించారు. బుధవారం రాత్రి శివ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



ముసునూరు: ముస్తాబైన బలివే రామలింగేశ్వరాలయం



తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెంలో కలశ స్థాపన చేసిన దృశ్యం



పోలవరం రూరల్: పట్టిసంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ శివకిషోర్, జేసీ ధాత్రిరెడ్డి

పట్టిసంలో ఏర్పాట్ల పరిశీలన

పోలవరం రూరల్: పట్టిసంలో మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను జాయింట్‌కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ పరిశీలించారు. నదిలో పంట్లు దాటే ప్రదేశం, ఇసుక తిన్నెలపై, దేవస్థానం వద్ద బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. దేవస్థానం వద్ద శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులు సౌకర్యార్థం చేసిన ఏర్పాట్లపై ప్రత్యేక అధికారి విశ్వనాథరాజు, ఈవో సురేష్‌నాయుడు, ఫౌండర్‌ఫ్యామిలీ మెంబర్ కె.వీరభద్రరావు వివరించారు. డ్రోన్ కెమేరాలు, సీసీ కెమేరాల ద్వారా ఎప్పటికప్పుడు భక్తుల రద్దీని అంచనా వేస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని సూచనలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఉత్సవ కమిటీ చైర్మన్, జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణను జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఆదేశించారు. ఉత్సవాలకు 500 మంది పోలీసులకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ కె.ప్రతాప్‌శివకిషోర్ తెలిపారు. డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ బాల సురేష్, ఎస్సై పవన్‌కుమార్, తహసీల్దార్ సాయి రాజు తదితరులు పాల్గొన్నారు.

సోమారామంలో పటిష్ట ఏర్పాట్లు



భీమవరం సోమేశ్వర జనార్దనస్వామి ఆలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ

భీమవరం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ అద్నాన్ నయీం చెప్పారు. మంగళవారం భీమవరం పట్టణం గునుపూడిలోని సోమేశ్వర జనార్దనస్వామి ఆలయం వద్ద శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల దర్శన నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు, క్యూలైన్లు, ఘాట్లు, పార్కింగ్ ప్రదేశాలు పరిశీలించి సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. స్వామి వారి రథోత్సవం, తెప్పోత్సవం సమయాల్లో అత్యంత అప్రమత్తతతో వ్యవహరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాల్లోని వివిధ ఆలయాల వద్ద సుమారు 600 మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నామన్నారు. ఆయన వెంట ఏఎస్పీ వి భీమారావు, డీఎస్పీ జయసూర్య జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, భీమవరం వన్ టౌన్ సీఐ ఎం నాగరాజు, దేవాలయ ఈవో డి రామకృష్ణంరాజు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

పంచారామంలో ఏర్పాట్లు పూర్తి



క్షీరారామంలో పుష్పాలంకరణ

పాలకొల్లు సెంట్రల్: మహాశివరాత్రి ఉత్సవాలకు పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయంలో విద్యుద్దీపాలంకరణలు, ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. భక్తుల కోసం ఉచిత, ప్రత్యేక దర్శనార్థం క్యూలైన్లను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు చేయించుకునే భక్తుల సౌకర్యార్థం ఆలయం వెనుకభాగంలో అలాగే పక్కనే ఉన్న అభిషేకాల మండపంలోను ఏర్పాట్లు చేశారు. స్వామివారికి లింగోద్భవ సమయంలో ఏర్పాటుచేసే మల్లన్న పాగాను బుధవారం సాయంత్రం 5 గంటలకు ఆలయం చుట్టూ ఉన్న మాడ వీధుల్లో ప్రదక్షిణ చేయించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ నూతనంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సీఐ రజనీకుమార్ తెలిపారు. తాగునీటి ప్యాకెట్లు, వైద్య సదుపాయం కల్పించారు. మంగళవారం రాత్రి ఆలయంలో ఏర్పాట్లపై పర్యవేక్షణ చేశారు. వేకువజామున నాలుగు గంటల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేసినట్లు ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 11 గంటల వరకూ స్వామివారికి అభిషేకాలు జరుగుతాయన్నారు. లింగోద్భవ సమయం అనంతరం స్వామివారికి లక్షపత్రి పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు.

అగ్గిపుల్లపై శివుని రూపం



అగ్గిపుల్లపై శివుని రూపం చిత్రీకరించిన దృశ్యం

ఏలూరు (టూటౌన్): అగ్గిపుల్లపై శివుని చిత్రాన్ని రూపొందించి అబ్బుర పరుస్తున్నారు సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్ బాబు. పండుగలు, జాతీయ పండుగ దినాల సందర్భంగా సందర్భోచితంగా స్పందించే సురేష్ బాబు తాజాగా శివరాత్రి సందర్భంగా అగ్గిపుల్లపై శివుని చిత్రాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా సూక్ష్మ కళాకారుడు సురేష్ బాబును పలువురు అభినందిస్తున్నారు.

వ్యభిచారం కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

కొయ్యలగూడెం: వ్యభిచారం కేసులో వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ మంగళవారం పేర్కొన్నారు. వివరాల ప్రకారం 2018 సంవత్సరంలో చిటికెన శ్రీను అనే వ్యక్తి పొంగుటూరులోని తన నివాసంలో వ్యభిచారం నిర్వహిస్తుండగా అప్పటి సీఐ కె.బాలరాజు దాడి జరిపి నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అప్పటినుంచి కేసు విచారణలో ఉండగా మంగళవారం కొవ్వూరు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై చెప్పారు.

అక్రమ కలప స్వాధీనం



కొయ్యలగూడెంలో అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న కలప లారీలు

కొయ్యలగూడెం: మూడు లారీల్లో అక్రమంగా తరలిస్తున్న కలపను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.దినేష్ తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున తూర్పుగోదావరి జిల్లా నుంచి దిప్పకాయలపాడు లారీల్లో బేరన్ క్యూరింగ్ నిర్వహణ కోసం తరలిస్తున్న కలపను గుర్తించామన్నారు. దీంతో సిబ్బందితో కలిసి కొయ్యలగూడెం సమీపంలో కలప లారీలను స్వాధీనం చేసుకుని కన్నాపురం రేంజ్ కార్యాలయానికి తరలించి సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ కలప విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని తెలిపారు.

మహాయజ్ఞానికి శ్రీకారం.. గణపతి హోమం



స్వామివారి మూలవిరాట్ వద్ద కంకణధారణ చేస్తున్న నరసింహ గురూజీ



మహాగణపతి హోమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

- నేటి రాత్రి సుందరగిరిపై.. అతిరుద్ర ప్రయోగ సహిత మహా సుదర్శన నృసింహ 31వ మహా యజ్ఞం
- క్రతువుకు పూర్తయిన ఏర్పాట్లు

ద్వారకాతిరుమల: సుందరగిరిపై స్వయంభూగా కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం నిర్వహించనున్న అతిరుద్ర ప్రయోగ సహిత మహా సుదర్శన నృసింహ 31వ మహా యజ్ఞానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి ఏటా వలె ఈ ఏడు కూడా మహా శివరాత్రి నాడు సాయంత్రం మొదలు తెల్లవార్లు ఈ మహా యజ్ఞాన్ని ఎంతో వైభవంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ యజ్ఞ ఏర్పాట్లను సీహెచ్ కుటుంబరావు పర్యవేక్షిస్తున్నారు. ఈక్రమంలో మంగళవారం ఆలయ యాగశాలలో భారీ ఏర్పాట్లు చేశారు. ముందుగా నరసింహ గురూజీ గర్భాలయంలో కొలువైన స్వామివారి మూలవిరాట్ వద్ద కంకణధారణ చేశారు. అనంతరం యాగశాలలో పండితులు, రుత్వికుల వేద మంత్రోచ్ఛరణల నడుమ మహాగణపతి పూజ, హోమాన్ని నిర్వహించారు. అలాగే శాలిగ్రామ అభిషేకం, శాలిగ్రామ అర్చన, అదేవిధంగా ప్రధాన హోమగుండ ప్రతిష్ఠతో పాటు విశేష పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. లోకశాంతి కోసం పలు వనమూలికలు, భక్ష్యాలు, వివిధ రకాల ద్రవ్యాలు, 9 రకాల సమిదులు, ఖరీదైన ద్రవ్యాలతో బుధవారం రాత్రి నిర్వహించనున్న ఈ యజ్ఞం భక్తులను పరవశింపజేయనుంది. ఈ యజ్ఞ క్రతువును భక్తులు యూట్యూబ్ ఛానల్ లింక్ https:www.youtube.com/@SriNrusimha Krupa ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించవచ్చని కుటుంబరావు తెలిపారు.

పాత నేరస్తుల బైండోవర్

తాడేపల్లిగూడెం: డ్యూటీపెయిడ్ లిక్కర్ కేసుల్లో పట్టుబడిన ఎనిమిది మంది పాత నేరస్తులను గూడెం ఎస్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి మంగళవారం పెంటపాడు తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. సత్ప్రవర్తన కోసం ఏడాది కాలానికి రూ.1.50 లక్షకు బాండ్ విలువకు బైండ్‌ఓవర్ చేశారు. ఈ ఏడాదిలో నిందితులు మరోసారి నేరం చేస్తే బాండును అనుసరించి పెనాల్టీ విధించి వారితో ప్రభుత్వ ఖజానాకు సొమ్ములు కట్టించడంతో పాటు చట్ట ప్రకారం శిక్షార్హులని సీఐ చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

భీమవరం: ఉరి వేసుకుని ఒక వ్యక్తి మృతి చెందాడు. భీమవరం ఒకటో పట్టణ పరిధి చినఅప్పారావుతోటకు చెందిన పులపర్తి బాలాజీ(37)కి మొగల్తూరు మండలం నీటితిప్పకు చెందిన ప్రసన్నతో ఏడేళ్ల కిందట వివాహమైంది. బాలాజీ ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తూ భీమవరంలో కాపురం ఉంటున్నారు. ఇటీవల బెట్టింగుల్లో ఆర్థికంగా నష్టపోగా అప్పులను కుటుంబ సభ్యులు తీర్చారు. సోమవారం రాత్రి బాలాజీ వేరే గదిలో ఒంటరిగా నిద్రించాడు. కుటుంబ సభ్యులు తెల్లారి లేచి చూసేసరికి బాలాజీ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతుడి తండ్రి సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్సై కిరణకుమార్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తేతలి శివరాత్రి వేడుకల్లో అలుగోత్సవం

- ఒంటికి శూలాలు గుచ్చుకున్న యువత
- ఒళ్లు గగుర్పొడిచేలా ప్రదర్శనలు

తణుకు అర్బన్: తణుకు మండలం తేతలి గ్రామంలో వేంచేసియున్న పార్వతీ రాజేశ్వరీస్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం ప్రబల ఉత్సవంలో భాగంగా నిర్వహించిన వీరభద్రుడి అలుగోత్సవంలో యువకులు శూలాలను ఒంటిపై గుచ్చుకుని చేసిన భక్తి విన్యాసాలు ఒళ్లు గగుర్పొడిచేలా నిలిచాయి. ఉత్సవం పాడవునా గ్రామానికి చెందిన యువకులు దవడ ఇటు నుంచి అటువైపునకు శూలాలు గుచ్చుకోవడం, ఒళ్లంతా వివిధ రకాల శూలాలను వేలాడదీయడమే కాకుండా వీపు భాగంలో కొంకీలను గుచ్చుకుని రథాలు లాగడం, వేళ్లాడడం వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఏటా అలుగోత్సవంలో యువకులు భక్తి పారవశ్యంతో ఎంతో సాహసంగా చేసే విన్యాసాలు ఆకర్షణగా నిలుస్తాయని గ్రామ పెద్దలు చెబుతున్నారు.



దవడలు, ఒంటికి శూలాలు గుచ్చుకుని వెళ్తున్న యువకులు



వీపుపై కొంకీలను గుచ్చుకుని క్రేన్‌కు వేళ్లాడుతున్న దృశ్యం

మూత్ర విసర్జనకు వెళ్లి.. కుప్పకూలి

పెదవేగి : నిద్రలో లేచి మూత్ర విసర్జన చేస్తున్న యువకుడు ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందాడు. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలివి. బి సింగవరం గ్రామానికి చెందిన పొలగాని ఉదయ్ కుమార్ (23)కు అదే గ్రామానికి చెందిన తేజశ్రీతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. ఉదయ్ కుమార్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 24వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో తన ఇంటి నుంచి డ్యూటీ కి వెళుతున్నానని తన భార్యకు చెప్పి, రాయన్నపాలెంలో ఉన్న తన అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. అక్కడ నిద్రిస్తుండగా మధ్యలో మూత్ర విసర్జనకు వెళ్లిన ఉదయ్‌కుమార్ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. స్నేహితులు, కుటుంబీకులు కలిసి అతడిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ చెప్పారు.

కార్మికుల జీవితాల్లో కారు చీకట్లు

- సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్న కూటమి ప్రభుత్వం
- ఎన్నికల్లో ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయని చంద్రబాబు
- ఐఏఎస్‌ల కమిటీకి ఎన్ని నెలలు కావాలి
- దశల వారీ ఆందోళన ఉధృతం


వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణ కోసం ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

తాడేపల్లిగూడెం: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం. కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామంటూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీలిచ్చారు. కార్మికులు సహజ మరణానికి రూ.60 వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు చెల్లిస్తామన్నారు. అదనంగా మట్టి ఖర్చులు మరో రూ.30వేలు ఇవికాక మహిళా కార్మికుల తొలి కాన్పునకు రూ.30 వేలు, రెండో కాన్పునకు రూ.30వేలు చెల్లిస్తామన్నారు. ప్రమాదవశాత్తు అంగవైకల్యం ఏర్పడితే రూ.5 లక్షలు అందిస్తామన్నారు. 60 ఏళ్లు దాటిన వృద్ధ కార్మికులకు పెన్షన్ రూపంలో సంక్షేమ బోర్డు ద్వారా సాయం అందిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. మాయ మాటలతో అమలు సాధ్యం కాని హామీలతో ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక ఆ హామీలన్నింటినీ చంద్రబాబు విస్మరించారు. జనసేన అధినేత తాడేపల్లిగూడెం ఎన్నికల సభలో వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటు చేస్తామని హామీని ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాసు కార్మికులను వెంట పెట్టుకొని ప్రభుత్వానికి వినతులు అందచేశారు.కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలేవీ అమలు చేయడం లేదు. ఫలితంగా భవన నిర్మాణ రంగ కార్మికుల జీవితాల్లో కారు చీకట్లు అలముకున్నాయి. రెక్కాడితే గాని డొక్కాడని వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుక కొరతకు తోడు నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరిగిపోవడంతో ఆ ప్రభావం భవన నిర్మాణ రంగంపై పడింది. ఫలితంగా పనులు దొరక్క కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోక వేలాది మంది కష్టజీవులు రోడ్డున పడ్డారు.

జిల్లాలో రెండు లక్షల మంది కార్మికులు

రాష్ట్రంలో సుమారు 22 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నట్టు లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల మంది వరకు భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు.భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్‌బోర్డును పునరుద్ధరించాలని, గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 46వేల క్లెయిమ్‌లను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఇచ్చిన పిలుపు మేరకు కార్మికులు కథం తొక్కారు. తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం పట్టణాల్లో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేశారు. గణపవరం, అత్తిలి, మొగల్తూరు, మండల కేంద్రాల్లో వినతి పత్రాలు అందజేశారు. పది మండల్లాలోని 62 గ్రామాల్లో కార్మికులు గ్రామ సచివాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. గూడెం పట్టణంలో 29 వార్డు సచివాలయాల్లో భవన నిర్మాణ కార్మికులు వినతులు అందజేశారు.

> **బోర్డును పునరుద్ధరించాలి**
>
> కార్మికుల్లో వ్యక్తమవుతున్న ఆందోళనను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఇప్పటికైనా భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలి. బోర్డు పునరుద్ధరణలో ఎదురయ్యే సాంకేతిక అంశాలను అధ్యయనం చేయడానికి ఐఏఎస్ అధికారులతో ఒక కమిటీని నియమిస్తామని కార్మిక శాఖ మంత్రి మూడు నెలల క్రితం హామీ ఇచ్చారు. అది అమలు చేసి కార్మికులకు న్యాయం చేయాలి.
>
> – డి.సోమసుందర్, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు

క్లుప్తంగా

మద్యం దుకాణాలకు సీల్


తణుకులో మద్యం దుకాణానికి సీల్ వేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

తణుకు అర్బన్: ఈనెల 27వ తేదీన ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలకు ఎక్సైజ్ అధికారులు సీల్ వేశారు. తణుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ పరిధిలోని 33 దుకాణాలకు మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఎక్సైజ్ అధికారులు తమ సిబ్బందితో కలిసి అన్ని దుకాణాలకు సీల్ వేశారు. తిరిగి ఈనెల 27వ తేదీ సాయంత్రం 4 గంటలకు సీల్ తీసి మద్యం అమ్మకాలకు అనుమతి ఇస్తామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. ఎక్సైజ్ శాఖ పరిధిలో ఎక్కడైనా అక్రమంగా మద్యం నిల్వలు ఉంచినా, అక్రమంగా విక్రయాలు జరిపినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మొబైల్ రూపంలో అమ్మకాలు చేసినా కేసులు నమోదు చేస్తామని అన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి అండగా పీడీఎఫ్


వెంకట్రావుపాలెంలో నమూనా బ్యాలెట్ పత్రాలను అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజాసమస్యల పరిష్కారానికి పీడీఎఫ్ అండగా నిలుస్తుందని రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాలుపూరి సత్యనారాయణ, కండెల్లి సోమరాజు అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రావుపాలెం గ్రామంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును గెలిపించాలని కోరుతూ గ్రాడ్యుయేట్లను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీగా వీరరాఘవులును గెలిపిస్తే మన హక్కులకోసం శాసనమండలిలో మాట్లాడే వారు ఉంటారన్నారు. ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఘనంగా మల్లిఖార్జున స్వామి కల్యాణం


మల్లిఖార్జునస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహాశివరాత్రి పురస్కరించుకొని స్థానిక ఏలూరు కాలువ వద్ద పురాతన పెద్ద శివాలయంలో మంగళవారం రాత్రి మల్లిఖార్జునస్వామి వారి కల్యాణం ఘనంగా జరిగింది. భక్తులు ఈలి వీర వెంకట సుబ్రమణ్యేశ్వరరావు, విజయభాముండేశ్వరి దేవి దంపతులు దివ్య కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. పురజన వర్తక సంఘం సభ్యులు పర్యవేక్షించారు. ఆలయానికి విద్యుత్‌లైట్లు ఏర్పాటు చేశారు. అంతేగాక వివిధ ఆలయాల్లో వాసవి ఆలయంలోను, షిర్డిసాయి ఆలయం వద్ద, చిన్న శివాలయం, జువ్వలపాలెం పురాతన శివాలయం, పట్టణంలోని ఇతర శివాలయాలను శివరాత్రి పురస్కరించుకుని స్వామివారికి కల్యాణాలు జరిగాయి.

తెలుగు భాషను సంరక్షించుకోవాలి

పెంటపాడు: మాతృభాషను సంరక్షించుకొనేలా ప్రతి విద్యార్థి తప్పక పాటు పడాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు సుంకర గోపాల్, పి. రామచంద్రుడు, ఇతర అధ్యాపకులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో విజ్ఞానం

తాడేపల్లిగూడెం రూరల్: వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విజ్ఞానం అలవడుతుందని కరస్పాండెంట్ వెలగల సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామంలోని స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సైన్స్ పట్ల విద్యార్థులు భయాన్ని వీడి, ఆసక్తిని పెంచుకోవాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన విండ్‌మిల్, హైడ్రో ఎలక్ట్రిక్ డ్యామ్ ప్రాజెక్టు, ఎర్త్ క్వాక్ అలారం సిస్టమ్, ఎంకరేజింగ్ టు ఇండియన్ ఆర్మీ, కన్‌స్ట్రక్షన్ ఆఫ్ షిప్ తదితర ప్రాజెక్టులు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వెలగల వెంకటరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ సూపర్‌వైజర్‌కు లయన్స్‌క్లబ్ బెస్ట్ సర్వీస్ అవార్డు


విజయకుమార్‌కు బెస్ట్ సర్వీస్ అవార్డు అందజేస్తున్న లయన్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ సూపర్‌వైజర్ దొంతల విజయకుమార్ లయన్స్‌క్లబ్ బెస్ట్ సర్వీస్ అవార్డును మంగళవారం స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ హాల్‌లో లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్‌చే అందుకున్నారు. విజయకుమార్‌ను సత్కరించారు. ఆర్టీసీ సేవలలో భాగంగా విజయకుమార్ ఆధ్వర్యంలో 6 మండలాలలోని దివ్యాంగులకు బస్సు పాస్‌లు(బస్సు పాస్ మేళా ద్వారా) అందజేశారు. అంతేగాక పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత బస్సు పాస్‌లను ఆయా పాఠశాలలకు వెళ్లి అందజేశారు. విజయకుమార్‌ను ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఉమాసిద్ధేశ్వరస్వామి కల్యాణం


బల్లిపాడులో విశేష అలంకరణలో ఉమాసిద్ధేశ్వరస్వామి

అత్తిలి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అత్తిలిలో ఉమాసిద్ధేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణం నిర్వహించారు. గ్రామానికి చెందిన యిర్రి సతీష్, వాణి దంపతులచే స్వామివారి కల్యాణం జరిపారు. ఆలయ అర్చకులు ఐలూరి సిద్దేశ్వరశర్మ, రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తారు.

బల్లిపాడులో..

మహాశివరాత్రి సందర్భంగా బల్లిపాడు గ్రామంలో కాశీ విశాలాక్షి, విశ్వేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు బాదంపూడి సోమశేఖరశర్మ ఆధ్వర్యంలో, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణతంతును నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

లక్ష రుద్రాక్షలతో శివలింగం ఏర్పాటు


రుద్రాక్షలతో ఏర్పాటు చేసిన శివలింగం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని స్థానిక హౌసింగ్‌బోర్డు వద్ద సువర్చల సమేత ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి లక్ష పంచముఖ రుద్రాక్షలతో శివలింగం ఏర్పాటు చేశారు. భక్తుల దర్శనార్థం ఆలయాన్ని రుద్రాక్షలతో అలంకరించారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఆకుల నరసింహమూర్తి పర్యవేక్షించారు.

తడి, పొడి చెత్తపై అవగాహన అవసరం


జగన్నాథపురం గ్రామంలోని సంపద తయారీ కేంద్రాలను పరిశీలిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తడి, పొడి చెత్తలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీపీఆర్‌సీ రిసోర్స్ కోఆర్డినేటర్ ఎడ్వర్డ్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఆర్‌సీ రిసోర్స్ కోఆర్డినేటర్ ఎడ్వర్డ్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేరు చేసి నాడెప్ పిట్‌లలో వేసి కంపోస్టు తయారు చేసి విక్రయించడం ద్వారా సంపదను సృష్టించవచ్చన్నారు. అనంతరం జగన్నాథపురం గ్రామంలోని మోడల్ ఎస్‌డబ్ల్యూపీసీని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, ఎంఆర్‌సీ ఎం.రవికిరణ్, జగన్నాథపురం పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్యసేవలు

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 27 మంది వృద్ధులు హాజరై వైద్యసేవలు పొందారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన శిబిరంలో సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వృద్ధులకు వైద్య సేవలతోపాటు ఆహార అలవాట్లు, వ్యాయామం, నడక అంశాలపై అవగాహన కల్పించారు. నిరుపేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

డ్రైయినేజీల్లో చెత్త వేయరాదు


పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: డ్రైయినేజీల్లో చెత్త, వ్యర్థాలు వేయడం వలన దోమ పుట్టుక పెరుగుతుందని తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం తణుకు మునిసిపాలిటీ పరిధిలోని జంగంచెర్వు ప్రాంతంలో ఫ్రైడే డ్రైడే, గ్రౌండ్ లెవెల్ మస్కిటో బ్రీడింగ్ సోర్సెస్, దోమకాటు వ్యాధులపై అవగాహన కార్యక్రమాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత విషయంలో అవగాహన కలిగి డ్రెయిన్‌లలో చెత్త వేయకుండా ఉండాలని, నీటి పారుదల ఆగితే దోమల ఉధృతి పెరుగుతుందని స్పష్టం చేశారు. డ్రెయినేజీలపై రాళ్లతో ఫిక్స్ చేయడం, అరుగులు కట్టడం మొదలగు చర్యల మూలంగా డ్రెయిన్‌ల క్లీనింగ్‌కు అవరోధమని చెప్పారు. పరిశుభ్రత విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే అనారోగ్యానికి బాట వేసినట్లేనని, దోమల నిర్మూలన అందరి బాధ్యతగా భావించాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్ పరిసరాలను పరిశీలించి, గుర్తించబడిన పారిశుద్ధ్య సమస్యని వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో సంబంధిత వార్డు హెల్త్ సెక్రెటరీ కె.బేబీకుమారి నమోదు చేశారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


మాట్లాడుతున్న కె.ఉమామహేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. స్థానిక యార్డు యూనియన్ కార్యాలయంలో అగ్రి కల్చరల్ మార్కెట్ యార్డు హమాలీస్ అండ్ అదర్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) 34వ వార్షికోత్సవం నాయకులు దేశంశెట్టి సతీష్ అధ్యక్షతన జరిగింది. ప్రజానాట్య మండలి కళాకారులు విప్లవ గీతాలు పాడారు. పోలా చంద్రశేఖర్ సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. గత సంవత్సరం కార్యకలాపాలు నివేదికను కార్యదర్శి ప్రవేశపెట్టారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, మునిసిపల్ జిల్లా కార్యదర్శి ధనాల వెంకట్రావు, నాయకులు చిర్ల పుల్లారెడ్డి, జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణలు మాట్లాడారు. వక్తలు మాట్లాడుతూ గతంలో మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కార్మికులను కట్టు బానిసలు మాదిరిగా మార్చారని, శ్రమ శక్తిని దోచుకుంటున్నారని చెప్పారు. సమ్మెహక్కును నిర్వీర్యం చేస్తున్నారని, హక్కులను కాలరాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యమాలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పెంటపాడు : క్రీడల ద్వారానే విద్యార్థుల మానసిక స్థైర్యం మెరుగుపడుతుందని ఎంఈవోలు టీవీ రామకృష్ణ, ఎం. శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. పెంటపాడు ఎస్టీపీఎస్ హిందూహైస్కూల్లో మూడు రోజులపాటు జరిగిన స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ జోనల్ స్థాయి క్రీడాపోటీలు మంగళవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో ముగింపు సమావేశం నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొని క్రీడలలో తమ ప్రతిభను చాటారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ తదితర పోటీలు బాల, బాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు క్రీడలలో ప్రతిభను కనపరిచారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు సత్తి కన్నారెడ్డి, శేఖరబాబుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో పీడీలు, పీఈటీలు, దిలీప్, చంద్రశేఖర్, యోహాను, కె. వెంకటేశ్వరరావు, శివలీల, తదితరులు ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు


కృష్ణాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంఈవో-2 పీఎంకే.జ్యోతి మాట్లాడుతూ శిక్షణ తరగతుల ద్వారా అభ్యసనపై మరింత పట్టు సాధించవచ్చన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయాలన్నారు. తద్వారా విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని కనకదుర్గ, రిసోర్స్‌పర్సన్స్ రామభద్రరావు, ఎ.పోతురాజు, పి.సన్యాసిరావు, కే.శ్రీదేవి, జి.బేబి, డి.ఎస్తేరురాణి, సీఆర్‌పీ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తణుకు అర్బన్: ఈనెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మంగళవారం పోలింగ్ కేంద్రాలను తణుకు తహసీల్దార్ దండు అశోక్‌వర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ తణుకు పట్టణంలో 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 4, జాస్తి సీతామహాలక్ష్మి బాలికొన్నత పాఠశాలలో 3, ఎస్సీఐఎం డిగ్రీ కళాశాలలో 3, జూనియర్ కళాశాలలో 2 కేంద్రాల్లో అన్ని సిద్ధం చేసినట్లు చెప్పారు. మొత్తం 8,542 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఏవుళ్లమ్మ జాతర మహోత్సవాలు

- పుట్టినింటికి వచ్చిన సజ్జాపురం ఇలవేలుపు ఏవుళ్లమ్మ తల్లి
- చల్లముంత, గరగలతో వచ్చి పూరిగుడిసెలో కొలువుతీరిన తల్లి
- సజ్జాపురంలో జాతర సందడి మొదలు


తణుకు సజ్జాపురంలో అమ్మవారి చల్లముంత ఉత్సవం


తణుకు సజ్జాపురంలో కొలువుతీరిన ఏవుళ్లమ్మ తల్లి

తణుకు అర్బన్: తణుకు సజ్జాపురవాసుల ఇలవే లుపు ఏవుళ్లమ్మ తల్లి జాతర మహోత్సవానికి అమ్మవారిని నడివీధికి తీసుకువచ్చారు. వచ్చేనెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే జాతర మహోత్సవానికి సంబంధించి మంగళవారం అమ్మవారిని ఆలయం నుంచి పుట్టింటికి తీసుకువచ్చే ఘట్టంలో భాగంగా జాతర మహోత్సవాల సందడి ప్రారంభమైంది. సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంతంలో శాస్త్రోక్తకంగా పూజాదికాలు నిర్వహించిన అనంతరం ఊరందరినీ చల్లంగా చూడు తల్లీ అనే నమ్మకంతో చల్లముంతతోపాటు అమ్మవారి గరగలను ఊరేగిస్తూ నడివీధిలో ఏర్పాటు చేసిన పూరి గుడిసెకు తీసుకువచ్చి ప్రత్యేకపూజల అనంతరం గుడిసెలో ఉంచారు. ఈ క్రమంలో తీన్‌మార్ డప్పులు, బాణాసంచా కాల్పుల మధ్య సాగిన ఊరేగింపులో దారిపొడవునా రోడ్డుపై చీరలు పరచి తడుపుతూ సజ్జాపుర మహిళలు అమ్మవారిని పుట్టింటికి ఆహ్వానించారు. చల్లముంత ఇంటి ముందుకు వస్తున్న నేపథ్యంలో మహిళలు తమ ఇళ్ల ముందు మజ్జిగ గ్లాసులతో నిల్చుని చల్లముంతలో మజ్జిగను పోస్తూ తమను చల్లగా చూడుతల్లీ అని మొక్కులు మొక్కుకున్నారు.

పుట్టినింటిగా కొమ్మిరెడ్డి.. అత్తింటిగా మాకినేడి

రెండేళ్లకోసారి నిర్వహించే ఈ జాతర మహోత్సవం దశాబ్దాల కాలంగా నిర్వహిస్తుండగా పుట్టినింటి వారిగా కొమ్మిరెడ్డి, అత్తింటిగా మాకినేడివారు పూజాధికాలు నిర్వహించడం మొదటి నుంచి సాంప్రదాయంగా సజ్జాపురంలో పాటిస్తారు. వచ్చేనెల 23న అమ్మవారి సేవ, 24న ఆగం, 25న నైవేద్యాలుగా ఈ జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ, సజ్జాపురం పెద్దలు కృషి చేస్తున్నారు. దేశం నలుమూలల ఉన్న సజ్జాపురవాసులు ఈ జాతర మహోత్సవంలో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో వస్తుంటారు. జాతర మహోత్సవం కన్నులపండువగా జరగనుంది.